క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనక మహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

యూఎల్‌సీ భూములు క్రమబద్ధీకరించుకోవాలి

మహారాణిపేట: పట్టణ గరిష్ఠ పరిమిత చట్టం (యూఎల్‌సీ) పరిధిలో మిగుల భూముల ఆక్రమణల క్రమబద్ధీకరణకు డిసెంబర్ 31లోగా దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం.మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2019 మే 1వ తేదీకి ముందు నుంచి ఆక్రమణలో ఉన్నట్టుగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, నిర్మాణం మీద జీవీఎంసీ అప్రూవల్ ప్లాన్, ఇంటి పన్ను రశీదు, కరెంటు బిల్ రసీదు, వాటర్ టాక్స్ రసీదుల నకళ్లతో సంబంధిత మండల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 150 చదరపు గజాలలోపు భూమిని ఉచితంగా, 151 నుంచి 300 చదరపు గజాల వరకు ప్రస్తుత రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూకి 15 శాతం, 300 చదరపు గజాల పైబడి 500 గజాల లోపు వరకు రిజిస్ట్రేషన్ బేసిక్ వేల్యూకు 30 శాతం, 500 గజాల పైబడిన వాటికి నూరు శాతం ప్రస్తుత బేసిక్ వేల్యూకు లెక్కించి డిమాండ్ డ్రాఫ్ట్ లేదా బ్యాంకర్ చెక్కు తీయాలన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్, కాంపిటెంటు అధికారి, పట్టణ భూగరిష్ట పరిమితి చట్టం, విశాఖపట్నం వారి పేరున డీడీ తీసి దరఖాస్తుతో జత చేసి సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

కుటుంబం చెంతకు వృద్ధురాలు



అన్నమ్మను మనుమరాలికి అప్పగిస్తున్న ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు

సీతమ్మధార: మానసిక రోగులైన ఇద్దరు కుమార్తెలు పెట్టే బాధలు భరించలేక ఇల్లు వదిలి వచ్చేసింది అన్నమ్మ (70). ఈమెది విశాఖపట్నమే. ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద రెండవ పట్టణ పోలీసులు ఈమెని గమనించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో ఆమెకు షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. మనుమరాలు మౌనికను రప్పించి ప్రగడ వాసు సమక్షంలో అప్పజెప్పారు. మహిళా షెల్టర్ హోం ద్వారా ఇప్పటి వరకు 655 మంది మహిళలను రక్షించినట్లు వాసు తెలిపారు.

కష్టాలకు వెరవదు.. కన్నీళ్లకు బెదరదు

స్త్రీలే సమాజంలో నిజమైన వాస్తుశిల్పులు అన్నాడొక దార్శనికుడు వెనుకటి రోజుల్లో. ఇంటి నుంచి కార్యాలయం వరకు తమ కనుసన్నల్లోని దేనినైనా వారు అందంగా తీర్చిదిద్దగలరు. రంగం ఏదైనా వారు నిజాయితీగా శ్రమిస్తారు. విజయ ఫలాలను నలుగురితో పంచుకుంటారు. పుట్టినప్పటి నుంచి కడ వరకు ఎన్నో ఆటుపోట్లను చవి చూస్తున్నా చెరిగిపోని చిరునవ్వే ఆమె విజయ రహస్యం. ఆమె ధీరత్వానికి.. కార్యదక్షతకు ఈ మహిళా దినోత్సవాన హ్యాట్సాఫ్..

అనంత పయనమే ఆమె ఆశయం

అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళ

కుటుంబ పోషణలో భాగస్వామ్యం

నేడు మహిళా దినోత్సవం..



పూర్ణామార్కెట్‌లో పారిశుధ్య పనిలో..



చిలకపేటలో నెత్తిన తట్టలు మోస్తూ దినచర్య ప్రారంభించిన వృద్ధురాలు



ఫిషింగ్ హార్బర్‌లో మండుటెండలో ఎండు చేపలు విక్రయిస్తూ..



సింగ్ హోటల్ జంక్షన్‌లో భవన నిర్మాణంలో సిమెంట్ పాళ్లు కలుపుతున్న వృద్ధురాలు



పాతపోస్టాఫీసు ప్రాంతంలో పోర్టు బొగ్గు కాలుష్యాన్ని శుభ్రం చేస్తూ..

దాబాగార్డెన్స్:

మహిళా 'శక్తి' ఎదుగుతోంది. పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. లేచింది మహిళా లోకం.. దద్దరిల్లింది పురుష ప్రపంచం అన్న పాటకు నిలువుటద్దంగా మహిళలు మారిన రోజులివి. ప్రతి పనిలోను మహిళల పాత్ర ఉంటుంది. చిరు వ్యాపారం నుంచి.. బడా కంపెనీల వరకు మహిళల పాత్ర ఎంతగానో ఉంటోంది. అప్పుడే పుట్టిన శిశువు నుంచి పండుటాకు వరకు ఈ పోటీ ప్రపంచంలో రాణిస్తున్నారనడానికి ఈ కథనంలోని ఫొటోలే నిదర్శనం. ఆరు పదుల వయసు మీరిన ఎందరో పండుటాకులు శేష జీవితంలో సంతోషంగా గడపకుండా.. జీవనాధారం కోసం ఇలా పనులు చేస్తూ 'సాక్షి' కంటపడ్డారిలా.

వృద్ధాప్యంలో కూడా..

ఏడు పదుల వయస్సులో కూడా అనేక మంది వృద్ధురాళ్లు కష్టపడతున్నారు. ఆర్థికంగా చితికిపోయినవారు.. భర్త లేని మహిళలు.. పిల్లలున్నా ఆదరణకు నోచుకోని ఎందరో పండుటాకులు దినదినగండగా రోజులు నెట్టుకొస్తూ పనులు చేసుకుంటున్నారు. పోర్టు కాలుష్యంతో పోరాడుతూ.. ఆ దుమ్ము, ధూళి నగర ప్రజలపై పడకుండా శుభ్రం చేస్తూ కాలం గడుపుతున్నవారు ఎందరో..

డొమెస్టిక్ వర్కర్లుగా..

ఇళ్లలో పని చేస్తూ కాలం ఈడ్చేవారు ఎందరో. పాతనగరంలోని అనేక ప్రాంతాల్లో ఎంతో మంది మహిళలు/ఒంటరి మహిళలు డొమెస్టిక్ వర్కర్లుగా పని చేస్తున్నారు. ఉదయాన్నే నిద్రలేచి ఇంటి పనులకు బయలుదేరి.. తిరిగి మధ్యాహ్నం భోజనం అనంతరం పనులు చేసుకుంటూ పిల్లల్ని చదివిస్తున్నారు.

భర్తల నిర్లక్ష్యంతో..

పని చేయడం పురుష లక్షణమైనప్పటికీ ఎందరో పురుషులు ఇంటి (సంసారాన్ని)ని పట్టించుకోకపోవడంతో మహిళలు కూలి పనుల బాట పడతున్నారు. ఇళ్లల్లో భర్తలు తాగి తందనాలు ఆడడం.. చాలీ చాలని ఆదాయంతో ఇంటిని నెట్టుకురావడం కష్టంగా ఉండడంతో ఈ రోజు అనేక మంది మహిళలు పాచిపనులు, భవన నిర్మాణ పనులకు వెళ్తున్నారు.

ముస్లిం కుటుంబానికి వాసుపల్లి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: మైనార్టీ వర్గానికి చెందిన ఓ పేద వధువు వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో తనపై ఎంతో ప్రేమాభిమానాలు చూపించే ముస్లిం మైనార్టీలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. మహ్మద్ సలీం, రషీద బేగం కుమార్తె వివాహ వేడుకకు వాసుపల్లిని ఆహ్వానించారు. ఒక్కటి కాబోతున్న పర్వీన్ (షాహిన్), మహ్మద్ సుభానీ జంటను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా సెక్రటరీ అమ్మాజీ, దశమంతుల మాణిక్యాలరావు, అలపన కనకరెడ్డి, ముజీబ్‌ఖాన్, భీశెట్టి ప్రసాద్, లింగం శ్రీను, అరుగుల రాజు, వాసుపల్లి రాజు, కోరాడ సురేష్, నౌషద్, వేణు, బుల్లెట్ రవి, తమ్మినేని శ్రీను, రోజా, రమణి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కీటకజనిత వ్యాధులతో అప్రమత్తం



మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచాలకులు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

మహారాణిపేట: దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అదనపు సంచలకులు డాక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి అన్నారు. శుక్రవారం సూర్యాబాగ్‌లోని బిల్ జంక్షన్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన ప్రోగ్రామ్ అధికారులు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. దోమల నియంత్రణకు ప్రభుత్వం తీసుకుంటున్న వివిధ చర్యలను వివరించారు. వాటిని గ్రామ, మండల, పట్టణ ప్రాంతాల్లో అమలు చేయాలని, దోమల నివారణలో ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా పాటించాలన్నారు. నివాస ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవడం, పరిసరాల పరిశుభ్రతపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు వైద్యులకు అవగాహన కల్పించారు. జోనల్ మలేరియా అధికారి డాక్టర్ పి.శాంతిప్రభ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా దోమలు ప్రబలకుండా జాగ్రత్త పడాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ జిల్లాలో అమలు పరుస్తున్న యాంటీ లార్వా పద్ధతులు, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలపై మలేరియా సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అవగాహన సదస్సుల ద్వారా మలేరియా కేసులు రాకుండా అదుపులో ఉండేటట్లు విశాఖ జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, పట్టణ, ప్రాథమిక వైద్యాధికారులు, మలేరియా సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా కృషి చేస్తేనే మహిళా సాధికారత



జీవీఎంసీలో మహిళా దినోత్సవ వేడుకల దృశ్యం



ఆటలాడుతున్న మహిళా ఉద్యోగులు



స్త్రీ శక్తి.. అంటూ విద్యార్థినుల నృత్య ప్రదర్శన



పేడాడ రమణకుమారిని సత్కరిస్తున్న క్వీన్స్ ఈవెంట్ నిర్వాహకులు



మహిళలతో జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఇతర అధికారులు



హెల్త్ చెకప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

దాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నగరానికి చెందిన క్వీన్స్ ఈవెంట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆట పాటలు.. నృత్యాలతో వేడుకలు అలరించాయి. వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు మహిళల్ని అవార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా క్వీన్ ఈవెంట్ అధినేత ఉష మాట్లాడుతూ గత ఐదేళ్లుగా మహిళా దినోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. స్త్రీలు సంకల్ప బలంతో ఏమైనా సాధించగలరన్నారు. అన్ని రంగాల్లో రాణించాలని అభిలషించారు. మహిళా సాధికారతకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. క్వీన్స్ ఈవెంట్ అధినేత ఉషను నిర్వాహకులు సత్కరించారు. అలాగే పేడాడ రమణకుమారి, రామ సత్యనారాయణ, మనుపల్ల, ప్రవీణ, బి. మాధురి, సంగీత, స్వర్ణలత, అల్లూరి హారతి తదితరులను సత్కరించారు.

మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలి..

జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ పీఎం సత్యవేణి పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురోగతి సాధించాలన్నారు. జీవీఎంసీ ఫైనాన్స్ అడ్వైజర్ మల్లికాంబ, భీమిలి జోనల్ కమిషనర్ ప్రసన్నవాణి, జెమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అక్కరబోయిన అప్పలరాజు, ఏపీ ఎంఈఎస్‌ఏ రాష్ట్ర మహిళా కార్యదర్శి సుబ్బలక్ష్మి, అప్పలరాజు, ఎం. రవి, వి. సన్యాసిరావు, వై. మూర్తి, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం..

హిమా హ్యూమానిటేరియన్, ఒరిస్సా స్టీవ్‌డోర్స్, ఎలయన్స్ కళాశాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కొల్ల సతీష్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ కార్తికేశ్వర పండా, ఈస్ట్ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి, స్పెషల్ మెట్రో పొలిటన్ మెజిస్ట్రేట్ పైలా సన్నిబాబు, హిమా హ్యూమానిటేరియన్ సంస్థ చైర్మన్ బీఎస్ మూర్తి, కేజీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ బి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న 23 మంది మహిళలను ఘనంగా సత్కరించారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల తదితరులు పాల్గొన్నారు. ప్రముఖ వాగ్గేయకారిణి, సంగీత విద్వాంసురాలు డాక్టర్ మండపాటి శారద, వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఎస్ అనురాధ, బి. సంతోషి అనూష, డాక్టర్ కేఎల్ శిరీష, విద్యార్థినులు పాల్గొన్నారు.

హెల్త్ చెకప్ పోస్టర్ ఆవిష్కరణ..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మెడికవర్ విమెన్ అండ్ చైల్డ్ ఆస్పత్రి ఆబ్‌స్టెట్రిషియన్ అండ్ గైనకాలజిస్టులు డాక్టర్ రాధిక, డాక్టర్ భూలక్ష్మి, డాక్టర్ విద్యారమా, డాక్టర్ గీత హెల్త్ చెకప్ పోస్టర్ ఆవిష్కరించారు. మహిళలందరి కోసం ఎగ్జిక్యూటివ్ హెల్త్ చెకప్‌ను అతి తక్కువ ధరకే అందిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశం ఈ నెల 31వరకు మాత్రమేనని తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు..

అల్లిపురం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వెంకటేశ్వరమెట్టపై గౌరీ మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, టీడీపీ నాయకులు శరగడం భాస్కర్ పాల్గొని విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు మంగరత్నం, సుగుణ, లీల, దేవి, బీమిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు అధిక ప్రాధాన్యమివ్వాలి

మహారాణిపేట: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించడానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం థీమ్ లింగ సమానత్వం, మహిళా సాధికారత ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి మాట్లాడుతూ నిరంతరం సేవా కార్యక్రమాలు, సృజనాత్మకత, ప్రజా సంక్షేమం పట్ల చూపిస్తున్న మహిళా ఉద్యోగుల అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పిలి దేవి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, ఆనందపురం ఎంపీడీవో జానకీ, పరిపాలనాధికారి ఎ.మంజువాణి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు పోటీలు..

కలెక్టరేట్ ఆవరణలో ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశాఖ ఆర్డీవో పి. శ్రీలేఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రాని అమ్మాజీ, శేష శైలజ, ఏపీ ఆర్ఎస్‌ఏ ప్రెసిడెంట్ త్రినాథరావు, జిల్లా చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఉమెన్ వింగ్ చైర్‌పర్సన్ శైలజ పాణి గ్రాహి, మహిళా సిబ్బంది పాల్గొన్నారు. ఆటల పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.



మహిళా దినోత్సవ శుభాకాంక్షలతో తీర్చిదిద్దిన రంగవల్లి



రంగవల్లులను పరిశీలిస్తున్న 33వ వార్డు కార్పొరేటర్ వసంతలక్ష్మి తదితరులు



మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

వైభవంగా రేణుక యల్లమ్మ జాతర



విశేష అలంకరణలో రేణుక యల్లమ్మవారు

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి 25వ వార్షిక జాతర మహోత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో పాటు కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి రమణమూర్తి, కళావతి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. వారికి ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు, ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యవర్గ సభ్యులు వాసుపల్లి నారాయణ, బొడ్డు పోలారావు, కోశాధికారి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు.

కలశాలతో భారీ ఊరేగింపు..

అచ్చియ్యమ్మపేట పోలేరమ్మ హుండీ వద్ద నుంచి పెద్ద ఎత్తున మహిళలు అమ్మవారిని అభిషేకించేందుకు పసుపు, కుంకుమ, వేపకొమ్మలతో కూడిన కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. జెండాచెట్టు వీధి, యాతపేట మీదుగా కెప్టెన్ రామారావు జంక్షన్‌లో గల అమ్మవారి దేవాలయానికి చేరుకుని అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. వారితో పాటు ఆలయ సలహాదారు బొడ్డేటి ప్రసాద్, దూడ అప్పారావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దేవాలయంతో పాటు అచ్చియ్యమ్మపేట వీధులన్నీ విద్యుద్దీపాలతో అలంకరించారు. రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని ధర్నా



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న కార్మికులు

సీతమ్మధార: కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ. 35 వేలు చెల్లించి, రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతన బోర్డును నియమించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం వాల్తేరు రైల్వే డివిజన్ కాంట్రాక్ట్ కార్మికులు, హిందూజా పవర్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు, విశాఖ కాంట్రాక్టు కార్మికులు, శ్రావణి షిప్పింగ్ కళాసీలు, స్టీల్ ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గర ఏఐటీయూసీ నేతృత్వంలో ధర్నా చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్, గ్రాట్యుటీ, పెన్షన్ సదుపాయం కల్పించాలని, వారాంతపు సెలవులు, పండగ సెలవులు, సిక్ లీవ్, ఈఎల్, క్యాజువల్ లీవ్ వంటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా శిబిరాన్ని జీఎస్‌జే ప్రారంభించగా జిల్లా ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి బూసి వెంకటరావు, అధ్యక్షుడు ఎం. మన్మథరావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సంయుక్త కార్యదర్శులు పి. చంద్రశేఖర్, కసిరెడ్డి సత్యనారాయణ, పడాల గోవిందు, జిల్లా సమితి సభ్యులు కాసుబాబు, నాగభూషణం, అచ్యుతరావు, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.